క్లుప్తంగా

అంబేడ్కర్ కుటుంబానికి ఆర్థిక సాయం



కైకలూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, దళిత నేత పెనుమాల అంబేడ్కర్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆలపాడు శివారు సోమేశ్వరం కాలనీలో శుక్రవారం ఎంపీపీ అడవి కృష్ణ, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, పల్లెవాడ పీఏసీఎస్ అధ్యక్షుడు గంగుల అశోక్ పరామర్శించారు. వీరు వ్యక్తిగతంగా రూ.50 వేలు సాయం అందించారు. పార్టీకి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. అంబేడ్కర్ కుటుంబానికి అండగా నిలుస్తామని నాయకులు తెలిపారు.

నిండిన తాగునీటి చెరువులు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని చెరువులు పూర్తిస్థాయిలో నీటితో నిండిపోవడంతో పోల్ రాజ్ కాలువకు నీటి సరఫరా నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కాలువ పరిధిలో ఉన్న 14 తాగునీటి చెరువుల్లో తాగునీటిని పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో నింపివేశారు.

29 నుంచి వేసవి శిక్షణ తరగతులు

అవనిగడ్డ: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ ఏడో తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిత్రలేఖనం, పుస్తక పఠనం, చదవడం, కథలు చెప్పడం, ఇంగ్లిష్ గ్రామర్, క్రాఫ్ట్ వర్క్, పేపర్ కటింగ్, అగర్‌బత్తీల తయారీ, గిఫ్ట్ ప్యాకింగ్, తెలుగు పద్యాలు, భగవద్గీత పఠనంపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ శిక్షణ కార్యక్రమానికి పిల్లలను పంపించి ప్రత్యేక అంశాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని కోరారు. వివరాలకు 91334 96141, 92909 98727 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ట

మండవల్లి: మండవల్లి స్టేషన్‌రోడ్‌లో ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటుచేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గతంలో శ్రీరామాలయం పక్కన ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం రోడ్డు విస్తరణలో కూలగొట్టిన విషయం తెలిసిందే.

పోరంకిలో బంగారం, నగదు చోరీ

పెనమలూరు: పోరంకిలో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామం నిడమానూరు రోడ్డుకు చెందిన ఎస్.వెంకటనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 19న హైదరాబాద్‌కు వెళ్లాడు. అయితే రెండు రోజుల క్రితం ఇంట్లో మొక్కలకు నీరు పోయటానికి వచ్చిన బంధువు ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉండటంతో వెంటనే వెంకటనారాయణకు సమాచారం ఇచ్చాడు. దీంతో వెంకటనారాయణ హైదరాబాద్ నుంచి వచ్చి ఇంట్లో పరిశీలించగా రూ.40 వేలు, బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

– గిలకలదిండి మెరైన్ సీఐ పెద్దిరాజు



కోనేరుసెంటర్: వేట నిషేధం సమయంలో ఎవరైనా చేపల వేటకు పాల్పడుతూ పట్టుబడితే పోలీస్ చర్యలు తప్పవని గిలకలదిండి మెరైన్ సీఐ బి.పెద్దిరాజు హెచ్చరించారు. ఆయన మెరైన్ పోలీస్ స్టేషన్లో బోట్ల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధం ఉన్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ రెండు మాసాల్లో బోట్ల యజమానులు చేపల వేటకు స్వస్తి పలకాలన్నారు. రహస్యంగా వేటకు పాల్పడినట్లు తెలిస్తే ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం కేసు నమోదు చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మెరైన్ డిక్లరేషన్ యాక్ట్ 1995 ప్రకారం చేపల వేటకు పాల్పడిన వ్యక్తులతో పాటు సంబంధిత బోటు యజమానులపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. సమావేశంలో మెరైన్ ఎస్ఐ పి.సోమశేఖర్‌రెడ్డి, ఫైబర్ బోట్లు సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నెలబాలుడు, మోటార్, మెకనైజ్డ్ మర బోట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిలో ఇంటింటా జగన్ మార్క్

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రచారంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



ఎమ్మెల్యే కొడాలి నానికి హారతి ఇచ్చిన మహిళలు

గుడ్లవల్లేరు: సంక్షేమం, అభివృద్ధిలో ఊరూరా.. ఇంటింటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్ కనిపిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. మండలంలోని కొతవరంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో కూడా సాకులు చెప్పకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రజలకు సంక్షేమ ఫలాలను అందజేశారని గుర్తు చేశారు. మంచి చేస్తానన్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. 2024లో కూడా అమలయ్యే పథకాలనే మేనిఫెస్టోలో జగన్ పెడతారన్నారు. చంద్రబాబులా అబద్ధపు హామీలు ఇవ్వబోరని స్పష్టం చేశారు. దత్తపుత్రుడు, మోదీ, బాబుతో కూడిన పాంప్లెట్ 2014లో ఇంటింటికీ పంపారని గుర్తు చేశారు. రైతు రుణ మాఫీ చేస్తానని ఒక్క రూపాయి కూడా చేయలేదన్నారు. ఆడ పిల్లలు పుడితే డిపాజిట్ చేస్తానని ఒక్క రూపాయి కూడా చేయలేదన్నారు. బాబు అబద్ధపు హామీలను తిప్పి కొడుతూ ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతుగా నిలబడాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఆయనకు ప్రజానీకం పూలమాలలు స్వాగతం పలికారు. అభివాదాలు చేస్తున్న ఆయనకు మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతించారు. ప్రజలు ఆయన్ను స్వాగతిస్తూ బ్రహ్మరథం పట్టారు.

ర్యాలీగా వచ్చిన ఆయనకు గ్రామస్తులు పూల వర్షం కురిపించారు. ఆలయాల్లో పూజలు చేసిన ఆయన మసీదు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ నాయకులు పొలడుగు రాంప్రసాద్, గిరి బాబాయ్, కేజే విక్టర్ పాల్, సూరపనేని కల్యాణ్, పార్టీ మండల అధ్యక్షుడు శాయన రవి, క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు లింగం జాన్‌బెన్నీ, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి చిన్ని, మండల బూత్ కన్వీనర్ కోటప్రోలు నాగు, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, ఎంపీటీసీ సభ్యులు పెనుమాల పూర్ణ కవిత, రంగారావు, చీరా దుర్గాభవాని, అశోక్, ఈడె లక్ష్మి, శ్రీనివాసరరావు, మండా దిలీప్, నాయకులు బాడిగ నాని, మన్నెం చంటి, పడమట నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ప్రలోభాలకు మోసపోవద్దు



అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

ముదినేపల్లి రూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు పెట్టే ప్రలోభాలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని ముదినేపల్లి శివారు అన్నవరంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు డీఎన్నార్, కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ తరఫున శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిపక్ష నేతల ప్రలోభాలకు లొంగితే భవిష్యత్తు అంధకారంగా మారిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. ప్రస్తుత ఎన్నికలు ధనవంతులు, పేదలకు మధ్య పోరాటంగా మారిందన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేసే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని, నవరత్నాల పేరుతో ఇప్పటికే గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫ్యాన్‌గుర్తుపై ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మరీదు నాగయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, నిమ్మగడ్డ భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

పథకాల కొనసాగేందుకు వైఎస్సార్ సీపీని గెలిపించండి



పోలాసివారిపాలెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

ఎమ్మెల్యే కొడాలి నాని



పోలాసివారిపాలెంలోని దేవస్థానంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

నందివాడ: సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. మండలంలోని అరిపిరాల, పోలాసివారిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కొడాలి నాని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఉన్న ఇంటింటికీ వెళ్లి తమ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు గోవాడ విజయకుమారి, పి.వెంకటేశ్వరరావు, దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, తోట నాగరాజు, అశోక్, రంగరావు, సన్నీ, గూడపాటి వెంకటేశ్వరరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

తొమ్మిది నామినేషన్ల తిరస్కరణ

– 17మంది అభ్యర్థుల నామినేషన్ల ఆమోదం

గుడివాడరూరల్: వచ్చే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుడివాడ అసెంబ్లీకి సంబంధించి 26 నామినేషన్లు దాఖలు కాగా శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ కార్యక్రమాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి నిర్వహించారు. నామినేషన్ల పరిశీలన అనంతరం వివిధ కారణాలతో తొమ్మిది మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఆర్వో తెలిపారు. 17 మంది నామినేషన్లను ఆమోదించినట్లు ఆమె పేర్కొన్నారు.

కైకలూరులో ఐదు..

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల పరిశీలనలో ఐదు నామినేషన్లను తిరస్కరించినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ శుక్రవారం తెలిపారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు గురువారం నాటికి మొత్తం 23 మంది అభ్యర్థులకు 44 నామినేషన్లను దాఖలు చేశారు. పరిశీలనలో బడుగు భాస్కరరావు, బడుగు సీతామహాలక్ష్మి, దూలం వీరాకుమారి, కామినేని మనోరమ, బొడ్డు జీవన్ దానియేల్ నోబుల్ నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్, వైఎస్సార్ సీపీ), కామినేని శ్రీనివాస్ (బీజేపీ), బొడ్డు నోబుల్ (కాంగ్రెస్), మన్నేపల్లి నాగేశ్వరరావు (బీఎస్పీ), లావేటి వీరశివాజీ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), గొంతువులుగు సతీష్ (జై భీం రామ్ భారత్ పార్టీ), కమతం నిరీక్షణరావు (భారత చైతన్య యువజన పార్టీ), పాముల ఏసుపాదం (భారత చైతన్య యువజన పార్టీ), స్వతంత్ర అభ్యర్థులు మదాసు సత్యనారాయణ, గునుకుల నారాయణ, అలుమోలు సోమేశ్వరరావు, కోటి శ్రీనివాసరావు, చెన్నంశెట్టి సోమసుందరరావు, కొప్పుల విజయబాబు, బలే గణేష్, బొడ్డు కిరణ్‌కుమార్, చింతాడ శ్రీనివాసరావు, తిరువీధుల శారద వంటి 18 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 వరకు గడువు ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



సంగమేశ్వరం పొలాల్లో సేద్యపు నీటి కుంట పనులు చేస్తున్న కూలీలు

నాగాయలంక: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.9 కోట్లతో 1200 పనులను జూన్ నాటికి పూర్తిచేస్తామని ఏపీఓ టి.వి.ఎస్ ముత్యాలు తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 22 పంచాయతీల పరిధిలో 5,300 మంది ఉపాధి కూలీలకు రూ.70 లక్షల విలువైన 169 పనులు చూపించామని పేర్కొన్నారు. ఈ పనులు చురుకుగా జరుగుతున్నాయని వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జె.కె.రామకుమార్ పర్యవేక్షణలో ఈ పనులు ఇప్పటికే 50 శాతం పూర్తయ్యాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పనులను సమీక్షిస్తూ కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఏపీఓ వెల్లడించారు. పంట బోదెలు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలు, మురుగు పారుదల కాలువలు, పశువుల నీటి చెరువుల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో నీడ కోసం పందిళ్లు, తాగునీటి సౌకర్యంతో పాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచామని వివరించారు.

30న ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: స్థానిక ఆంధ్రా ఆస్పత్రిలో ఈ నెల 30వ తేదీన ఉచిత గుండె సంబంధ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తామని ఆస్పత్రి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోగులకు వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, ఛాతీలో నొప్పి, దడ, అధిక రక్తపోటు, కాళ్ల బరువు తదితర సమస్యలతో బాధపడే రోగులు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందొచ్చని సూచించారు. ఈసీజీ, జీఆర్‌బీఎస్, టూడీ ఎకో పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఇతర రక్తపరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని మచిలీపట్నం ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ, వేదికపై ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

మండవల్లి: ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. భైరవపట్నం శుభం ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ మండవల్లి మండల నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశం శుక్రవారం సాయంత్రం ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసి అనేక సేవలు అందించి, పలు సంక్షేమ పథకాలు గడప గడపకు అందించి ప్రజలకు ఆర్థిక సమస్యల నుంచి వెసులుబాటు కల్పించడం గర్వంగా ఉందన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేయాలని కోరారు. ప్రతిపక్ష నాయకుల వద్ద చెప్పడానికి ఏమీ లేక నాయకులను డబ్బు మూటలతో లోబరచుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బీవీ రావు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు అధికారంలో ఉన్న సమయంలో ఆయన సామాజిక వర్గానికి మాత్రమే చేసి, మిగిలిన వర్గాలను బానిసలుగా ఉపయోగించుకోవడం ఆయన నైజం అని ఆరోపించారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పోసిన చెంచు రామారావు, సర్పంచ్ మెండా ఝాన్సి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబు రాజు, కోఆప్షన్ సభ్యుడు దత్తాడ డేవిడ్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కురేళ్ల యేసుమరియమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షుడు గుడివాడ బాబీ, గుడివాడ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



యద్దనపూడిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న యద్దనపూడి గ్రామస్తులు

యద్దనపూడి(మొవ్వ): వైఎస్సార్ సీపీ పాలనలో గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గమనించి, రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మొవ్వ మండలంలోని యద్దనపూడి, పెదసనగల్లుపాలెం, పెదపూడి, కూచిపూడి గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, మహిళలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా ఓటు వేశారా.. వేయలేదా.. అని చూడకుండానే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, మచిలీపట్నం ఎంపీగా సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, నాయకులు గోగినేని పెరుమాళ్లు, మంద శ్రీనివాసరెడ్డి, కాకార్ల శివకుమార్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులను గుర్తించింది సీఎం జగనే



ఐనపూరులో నాయీబ్రాహ్మణ సంఘీయులను కలిసి ప్రచారం చేస్తున్న సంఘ నాయకులు

పమిడముక్కల: దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నాయీబ్రాహ్మణులను గుర్తించి, తిరుమల తిరుపతి దేవస్థానంలో డైరెక్టర్ పోస్టు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆ సంఘం జిల్లా నాయకులు ప్రాకర్ల వేణుబాబు, ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని కూడేరు, ఐనపూరు, కపిలేశ్వరపురం, మంటాడ, హనుమంతపురం, ముళంలపూడి, వేల్పూరు, వీరంకిలాకు, వీరంకి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని నాయీబ్రాహ్మణ సంఘీయుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం ఐదేళ్లలో అందించిన పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. జీఓ నంబరు 59 ద్వారా షాపు ఉన్న నాయీబ్రాహ్మణులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం, జీఓ నంబరు 15 ద్వారా సెలూన్ షాపులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, జీఓ నంబరు 50 ద్వారా నాయీబ్రాహ్మణులకు సామాజిక భద్రత కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పాలకవర్గ సభ్యులుగా నియమించారని తెలిపారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించిన వైఎస్సార్ సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బయవరపు దుర్గాప్రసాద్, ప్రాకర్లశివ, కోరుమిల్లి మురళి, పావులూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకే ఓట్లేయండి



ఆటపాకలో ఎమ్మెల్యే డీఎన్నార్‌కు మద్దతుగా ఓట్లు అభ్యర్థిస్తున్న ఆయన సతీమణి వీరాకుమారి

కైకలూరు: నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి విజయం చేకూర్చాలని ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి కోరారు. ఆటపాక గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఆమె ఓట్లు అభ్యర్థించారు. ప్రతి మండంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. కూటమి అభ్యర్థులు ఆరోపణలను నమ్మవద్దని సూచించారు. మరో పర్యాయం వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీటీసీ తమ్మిశెట్టి లక్ష్మీ, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, ఉప సర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు శింగంశెట్టి రాము, బందా నారాయణ, కన్నా రమేష్, విమల్, పంజా నాగు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో వంటశాల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న ధర్మకర్త రాంబాబు తదితరులు

గణపేశ్వరం(నాగాయలంక): గ్రామంలోని ప్రసిద్ధ శ్రీదుర్గా గణపేశ్వరస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో చేపట్టి వంటశాల నిర్మాణ పనులకు ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు) శుక్రవారం భూమిపూజ చేశారు. రాజమండ్రిలో నివసిస్తున్న నాగాయలంకకు చెందిన దాత తలశిల జనార్దనరావు(జన్నయ్య) వంట శాల నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. వర్రే భిక్షం, పిరాటి శ్రీనావాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



స్వామివారికి ఊంజల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీసీతారాముల కల్యాణం జరిగి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో ఈ వేడుక జరిపారు. తొలుత స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులచే శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, ద్వాదశ ప్రదక్షిణలు జరిపారు. అనంతరం భక్తుల గీతాలాపన మధ్య శ్రీసీతారామచంద్ర స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు. పలువురు పుర ప్రముఖులు, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.